# చిలిపి ప్రభ

జి. జానకి శాస్త్రి



ఆ రోజు లక్ష్మివారం. సెలవలవడం వల్ల ఇంట్లోనే ఉన్నాను. అప్పుడే రెండుసార్లు పోలీసు కారు మా వీథిలోకి వచ్చి, కొద్ది నిముషాలువుండి వెళ్లిపోయిం ది. మా వీథి అర్ధ చంద్రాకారంగా ఉంటుంది. మా వీథిలోంచి వెనక వీథులకి వెళ్లేందుకు దారిలేదు. ఇ లాంటి వీథులని క్లోజ్ అంటారు. మా క్లోజ్‌లో అయిదుయిళ్లు ఉన్నాయి. మా ఇల్లు మొదటిది. పోలీసు కారు, వచ్చిన రెండుసార్లూనూ మా ఇంటిఎదురుగా ఆగింది. పోలీసులు కారుదిగి ఎవ్వరింటికైనా వెళ్తారేమోనని కిటికీలోంచి చూశాను. కాని వాళ్లు ఎవ్వరింటికి వెళ్లకుండానే వెళ్లిపోయారు.

వాళ్లు వెళ్లిపోగానే....కూడబలుక్కున్నట్టుగా అందరం వీథిలోకి చేరుకున్నాము.

"ఏమిటో ఇవాళ పోలీసుజోరు మహా హుషారుగా ఉంది'' అన్నాడు ఎదురింటి జాన్.

"అవును. మీ ఇంటిముందరే ఆగింది. ఏంటి చేశావేమిటి జాన్'' అన్నాడు పొరుగింటి మైకల్.

జాన్ చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

'ఎవరింట్లోనైనా దొంగతనం జరగలేదు కదా' అంది మిషేల్ అందరివేపు చూస్తూ.

అందరం ఒకరివేపు ఒకరు చూసుకున్నాము.

"ఐ డోంట్ థింక్ సో'' అన్నాడు పాల్.

అందరం ఒక్కోదారిలో ఆలోచించాము. ఎవ్వరికీ సరైన సమాధానం దొరకలేదు.

"బర్మింగమ్‌లోను, లండన్‌లోను ఈ మధ్యన బాంబులు పెట్టారట కదా! అందుకని....''

"కమాన్ మైకేల్, లండనులో బాంబులకి మన క్లోజ్‌కి సంబంధం ఏమిటి?'' నువ్వు ఏదీతిన్నగా ఆలోచించవు'' అన్నాడు జాన్ నవ్వుతూ.

"నిజమే! ఇక్కడ ఎవ్వరు ఐరిష్‌వాళ్లు కూడా లేరు. అనుమానపడటానికి'' అంది ఏన్ వెంటనే!

"ఐరిష్‌వాళ్లు ఉన్నా అందరు ఐరిష్‌వాళ్లు బాంబులు పెట్టరు కదా!'' అంది ఏన్ వెంటనే. ఏన్, నిజంగా ఇండియన్నై పుట్టాల్సింది. ప్రతీదానికి గట్టిగా వాదిస్తుంది. ఎవ్వరైనా 'పొలిటికల్'గా తప్పుగా మాట్లాడుతే వాళ్లతో యుద్ధానికి దిగుతుంది. వాదించడమంటే తనకి మహా సరదా!

"అబ్బే ! నేను అలాగ అనలేదు'' అంది మేండి భయపడుతూ.

"సరే, ఇంతకీ పోలీసుల 'దాడి' గురించి ఏమి చేద్దాం'' అన్నాను. మాట మారుస్తూ. నా వేపు కృతజ్ఞతగా చూసింది మేండి.

"ఆలోచించడానికి ఏముంది? ఈసారి వాళ్లు

వస్తే, నేనే వెళ్లి అడుగుతాను. ఏంటి సంగతని?" అంది ఏన్.

"అదే మంచిదేమో! యూఆర్ బ్రేవ్" అన్నాది మిషేల్.

"మన క్లోజ్‌లో ఏదైనా జరుగుతే, ముందు మనకు తెలియాలి కదా! ఐహేట్ సీక్రసీ" అన్నాడు పాల్.

ఇంకొక గంటసేపు పోలీసుల గురించి మాట్లాడుకుని, ఎవరిళ్లలోకి వాళ్లు వెళ్లిపోయాము. ఆ రోజంతా పోలీసుకారు మా క్లోజ్‌లోకి రాలేదు.

సోమవారం ఆఫీసుకి వెళ్లాను. లంచ్‌టైమ్‌లో సూపర్‌మార్కెట్టుకి వెళ్తుంటే ఎవ్వరిదో కారు నన్ను ఫాలో అవుతున్నట్లుగా అనుమానం వచ్చింది. మెయిన్‌రోడ్ వదిలేసి అడ్డదారంట నా కారు నడిపాను. నా వెనక కారుకూడా నా వెనకాలే వచ్చింది. ఇక అనుమానం లేదు. నిజంగానే నన్ను ఫాలో అవుతున్నారు ఎవ్వరో. నేను సూపర్‌మార్కెట్ పార్కింగులోకి వెళ్లగానే, నా వెనక కారు ముందుకు దూసుకు పోయింది.

ఆ రాత్రి భోజనాలప్పుడు అందరికీ చెప్పాను మధ్యాహ్నం జరిగిన సంగతి.

"టివిలో డిటెక్టివ్‌లు ఎప్పుడూ చూస్తుంటావు కదా! అంచేత నీకు అందరూ నిన్ను ఫాలో అవుతున్నట్టే ఉంది" అన్నారు శ్రీవారు.

ఆయనకు టీవీ అంటే చిరాకు. నేను ఎక్కువగా టి.వి చూస్తానని ఛాన్సు దొరికినప్పుడల్లా దెప్పిపొడుస్తారు.

"మమ్మీని అలా కొట్టి పారేయడానికి వీలు లేదు డాడీ! ప్రతీదానికి ఒక రీజను ఉంటుంది. అదేమిటో తెలుసుకుంటే అనుమానాలుండవు" అన్నాడు కాలేజీలో చదువుతున్న మా అబ్బాయి.

"ఆ సంగతులు అందరికి తెలుసులే బ్రదర్! ఆ రీజను ఎలాగ కనుక్కోగలవో చెప్పు బిబి" (అంటే వాడి నిక్‌నేమ్ 'బ్రెయిన్‌ఆఫ్ బ్రిటన్' అన్న మాట)అంది మా అమ్మాయి వాళ్ల అన్నయ్యని సవాలు చేస్తూ.

"దానికేమిటి? సింపుల్! ఇంతకీ బ్రెయినంటూ ఉంటే ఎలా కనుక్కోవాలో ఎవ్వరూ చెప్పక్ఖర్లేదు" అన్నాడు అబ్బాయి కయ్యానికి కాలుదూస్తూ.

"ఆపండిరా ..మీరిద్దరూ?? మీ దెబ్బలాటలు రోజూ ఉండేవే! ఇవాళ నేను చాలా అలిసిపోయాను. నన్ను విసిగించకండి. కాస్సేపుపోయి మేడమీద నా గదిలో కూర్చుంటాను. గొడవ పెట్టకండి"

మా ఇంట్లో అలసట లేనిది నాకొక్కర్తికే!

"రవీ! ప్రభ తెచ్చిపెడ్దా బాబూ" అంటూ ఆయన మేడెక్కిపోయారు.

"అమ్మా! ప్రభ ఎక్కడ పెట్టావు?"

"నేను ఎక్కడా పెట్టలేదు"

"అయితే ఏమయింది?ఎక్కడా కనిపించడం లేదు?"

"ఆ మాత్రం తెలియదా బి.బి? అంటే ఈ వారం ప్రభరాలేదన్న మాట!" అంది మా అమ్మాయి వెక్కిరిస్తూ.

"డాడీ! ప్రభ రాలేదుట!" అంటూ మెట్ల కింద నుంచే అరిచి, బైటికి వెళ్లిపోయాడు అబ్బాయి.

"ఇవాళ రావాలి కదా! ఎందుకురాలేదు?"అంటూ ప్రశ్నించారు. అతికష్టం మీద నాలుగుమెట్లు కిందికిదిగి మావారు -

"ఎందుకంటే నాకేం తెలుసు?" అన్నాను విసుగ్గా.

"అతనికి ఫోన్ చేయలేకపోయావా?"

"ఆ మాత్రం ఆలోచన నాకూ వచ్చింది?"

"డాడీ! మమ్ కూడా ఆలోచించగలదు" అంది మా అమ్మాయి నాకు వంతపాడుతూ.

"సరే, మీ ఉమన్‌పవర్ కలుస్తే నేనింక బతకలేను.. ఇంతకీ అతనేమన్నాడు?"

"ఏమంటాడు?మామూలే! అందుకే ఈ రోజు ఫోన్ చేయలేదు. అదో దండగ"

మేము ఆంధ్రప్రభకి సంవత్సర చందా కడ్తాము. లండన్‌లో ఒక ఏజెన్సీవాళ్లు అన్ని భారతీయభాషలలో మాగజైన్లు తెప్పించి బట్వాడా చేస్తారు. అప్పుడప్పుడు ఆంధ్రప్రభ మిస్సవుతూ ఉంటుంది. ముఖ్యంగా ఏవైనా ప్రత్యేకసంచికలు ఉంటే .. అవి తప్పకుండా మిస్సవుతాయి. అప్పుడు నేను ఫోన్‌చేయడం, అతను అదే జవాబు చెప్పడం....తరచూ జరిగే ఫార్సే!

"హలో ఏజెన్సీ"

"జీహా"

"మై లీడ్స్ సే బోల్ రహాహుఁ"

"క్యా లీడ్?"

"లీడ్‌నహీ! లీడ్స్. యార్క్‌షైర్‌కే లీడ్స్"

"ఓయీ, లీడ్ హైనా?" (లీడ్స్ Leeds లో స్పెల్లింగ్ లో ఆఖరిఅక్షరం ఉండకూడదంటాడు. ఏమంటే లీడ్ ఏక్ టౌన్ హై. దో తో నహీ...అంటూ సవాలు చేస్తాడు. అతనితో ఇంగ్లీషుభాష గురించి ఒట్టి దండగ)

"జీ"

"క్యా చాయియే?"

"ఆంధ్రప్రభ వీక్లీ"

"ఏక్ మినిట్" అంటూ ఫోన్ కిందపెట్టేసి గట్టిగా నలుగురైదుగురు మనుషుల్ని పేరు పెట్టి పిలుస్తాడు. ఒక పదినిముషాలు వాళ్లతో చర్చలు జరిగిన తర్వాత మళ్లీ ఫోను ఎత్తుతాడు.

"హల్లో లీడ్"

"జీ!"

"మాఫ్ కీజియే! ఓనహీ ఆయా."

"క్యూం?"

## గుడ్ నైట్ కిస్



ప్రతిరోజునీ గుడ్ నైట్ కిస్‌తో ముగించాలనుకునేవారికి నోటి దుర్వాసన ఓ సమస్య కావచ్చు. అలాటివారికోసం అమెరికాలో ఇటీవల రెండువందల టాబ్లెట్లు 21 డాలర్ల 60 సెంట్స్ ఖరీదుచేసే 'బ్రీత్ అష్యూర్' టాబ్లెట్స్ మార్కెట్లోకి వచ్చాయి. భోజనంతోపాటు ఇవి రెండుమూడు తీసుకుంటే జీర్ణాశయంలోంచి వెలువడే దుర్వాసనని అరికడుతుంది. పైగా నోటికి మింట్‌వాసనని ఇస్తుంది. మీరూ తీసుకోవాలనుకుంటే చిరునామా ఇదిగో...Breath Asure, Dept 560 18034 Ventura BLVD. Suite 307, ENCINOCA 91316, USA.

- పృథ్వీరాజ్

## ప్రకృతి బుడగలు

ఇండోనేషియా జావా ద్వీపంలో ఒక సరస్సు నీటిపైతలం నుంచి బయలుదేరే ఆవిరి, ఇతర గాస్‌లు ఆరు అడుగుల పెద్ద పెద్ద బుడగలుగా బయలుదేరి బెలూన్‌లుగా గాలిలోకి పైకివచ్చి పెద్దశబ్దంతో పేలిపోతుంటాయి.

శ్రీకొండ (ఎర్రబోడు)

"ఇండియాసే నహి ఆయా"

"క్యూం?"

"ఆప్ జాన్‌తే హై.. దేశ్ కీ హాల్ ..."

"ఠీక్ హై"

వెంటనే ఫోన్‌పెట్టేయడం మంచిది. లేకపోతే ఇండియన్ పాలిటిక్స్ మీదా, దేశపరిస్థితుల మీదా అనర్గళంగా ఒక గంటసేపు లెక్చరిచ్చేయగలడు.

"అతడి జవాబులు తెలిసినవే కదా! అందుకే ఇవాళ ఫోను చేయలేదు" అన్నాను శ్రీవారితో.

"సరేలే! మన ఖర్మ ఈసారి ఉగాది సంచిక కదా! అందుకే మిస్సయ్యింది. వచ్చేవారం ప్రభ తప్పకుండా వస్తుంది" అంటూ సణుగుతూ ఆ నాలుగుమెట్లూ అతికష్టం మీద ఎక్కి గదిలోకి వెళ్లిపోయారు.

పనులన్నీ చక్కబెట్టుకుని ముందుగదిలోకి వచ్చేసరికి మాఅమ్మాయి పరిగెట్టుకుంటూ వచ్చింది.

"అమ్మా వేగిరం రా" అంటూ దాని గదిలోకి ఈడ్చుకుపోయింది. దాని గదంతా చీకటిగా ఉంది.

"ఏమమ్మా బల్బు మార్చాలా?"

"అమ్మా లైటేయక. ముందు రోడ్డుకి అవతల వేపు ఉన్న బ్లూకారు చూడు."

"బ్లూనో ...గ్రీనో... కార్లకేమి కొదవమ్మా ఈ దేశంలో ?"

"అమ్మా చూడు. ఇది సీరియస్ మాటరు. జాగ్రత్తగా చూడు. ఆ కారు వెనకసీట్లో ఉన్నవాడు బైనాక్యులర్స్‌తో మన ఇంటివేపే చూస్తున్నాడు. ఇందాకటి నుంచి"

జాగ్రత్తగా చూశాను. నిజమే! ఎవ్వరో మా ఇంటివేపు కన్నువేసి ఉంచారు. ఎందుకట? కొంచెం భయమేసింది. మేమిద్దరం వెళ్లి మావారితో చెప్పాము.

"మీ ఆడవాళ్లతో వచ్చిన చిక్కే ఇది! ప్రతీది అనుమానమే! " అన్నారు.

"అది కాదండీ. నిజంగా ఎవ్వరో బైనాక్యులర్స్‌తో మన ఇంటివేపు చూస్తున్నారండి'

"రవి చిన్నప్పుడు బైనాక్యులర్స్‌తో అందరిళ్ల లోకి చూసేవాడు జ్ఞాపకం లేదూ!అప్పుడు నువ్వే మనే దానివి... పెద్దయితే మనవాడు స్కాట్‌లాండ్ యార్డ్‌లో డిటెక్టివ్ అవుతాడని మురిసిపోయేదానివి జ్ఞాపకం లేదూ!" అన్నారు నవ్వుతూ.

"ఏదో పని కూన చేసిన పను లకి మురిసిపోవడం తప్పా? ఇంతకీ వాడికి తప్పునాన్నా అని చెప్పితే మానేయలేదూ!"

"అలాగే ఏ పసివెధవో మన ఇంటివేపు చూస్తూంటాడు. దానికి ఇంత గాభరా దేనికి?" అన్నారు కుర్చీలోంచి కదలకుండా.

"కమాన్ డాడీ! ఇది సీరియస్ మేటర్. హి ఈజ్ ఎ స్పై" అంటూ వాళ్ల డాడీని చెయ్యిపుచ్చుకుని లేపి తన గదిలోకి తీసుకువెళ్లింది.ఆ బ్లూ కారు వాడు ఇంకా మా ఇంటివేపే చూస్తున్నాడు.

ఆయనకి కూడా కొంచెం అనుమానం వచ్చినట్టుగా ఉంది. రెండునిముషాలు ఆలోచించారు.

"సరే పద. నువ్వూ నేనూ కలిసి చిన్నవాక్‌కి వెళ్దాం" అంటూ కోటు, బూటు వేసుకున్నారు. పైన ఇంకా చిన్నగా మంచుకురుస్తున్నది. ఇంగ్లాండులో లీడ్స్‌లో చాలా చలిగా ఉంటుంది. ఒక్కొక్కప్పుడు మే నెల దాకా మంచు కురుస్తుంటుంది.

వాళ్లిద్దరూ ఎడంవేపు తిరిగి కొద్దినిముషాలు నడిచి, రోడ్డుదాటి కారు వేపుగా వెళ్లారు. వీళ్ల కారు దరిచేరగానే ఆ బ్లూకారు మెల్లగా వెళ్లిపోయింది. మా అమ్మాయి కారునెంబరు నోట్ చేసుకుంది.

ఆ రాత్రంతా, ఆ కారు గురించే ఆలోచించాము. ఇదేదో దొంగలగుంపు కాదుకదా! అన్న అనుమానం కూడా వచ్చింది. అందరం పొద్దుననగా ఇళ్లు వదిలివెళ్లిపోతే సాయంత్రం కానీ ఇళ్లకు తిరిగిరాము కాబట్టి రోజంతా మా వీధి నిర్మానుష్యంగా ఉంటుంది. ఈ మధ్యన పగటి దొంగతనాలు ఎక్కువవు తున్నాయట...అన్ని పట్టణాలలో...

ఎందుకైనా మంచిదని నా అనుమానం గురించి, బ్లూకారు స్పై గురించీ ఇరుగుపొరుగులందరికీ చెప్పేశాము. మూడో నెంబరు ఇంట్లోఉన్న ఏన్ ఒకత్తే ఈ మధ్యన ఉద్యోగానికి వెళ్లడం లేదు. "నేను కూడా ఒక కన్ను వేసి ఉంచుతానులే!" అని అందరికీ హామీ ఇచ్చింది.

రెండు రోజులు మరేమీ వింతలు జరగలేదు. మూడో రోజు ఒక ఎర్రకారు వచ్చి మా ఇంటికి ఎదరగా పార్క్ చేసి, రెండు మూడుగంటల తరువాత వెళ్లిపోయింది.

తరువాత ఒక పదిరోజులు పోలీసుకార్లు తరచూ మా వీధి పక్కనుంచే వెళ్తుండేవి. మా క్లోజ్‌లోకి మాత్రం రాలేదు. ఈమధ్యన ఇరుగుపొరుగు ఒకరివేపు ఒకరు అనుమానంగా చూసుకోనారంభించారు. కానీ ఎవ్వరూ గబుక్కున నోరు జార్చేసుకోలేదు. అది ఇంగ్లీషు పద్దతి.

మరో వారంరోజుల తర్వాత పోలీసుదాడి తగ్గింది. ఆ ఆదివారం ఇరుగు పొరుగు కలిశాము.

"పోలీసులకు ఏదో ఐ.ఆర్.ఎ అనుమానం వచ్చి వుంటుంది. ఈ మధ్యన ఇలాగే చాలా చోట్ల సెర్చ్ చేస్తున్నారట" అన్నాడు మైకల్.

"సెర్చ్ చేయనీ మన సేఫ్టీకే కదా! " అంది ఏన్.

ఇంకొంచెం సేపు టెర్రరిజం గురించి మాట్లాడుకుని ఎవ్వరిళ్లకి వాళ్లు వెళ్లిపోయాము.

ఒకరోజు నేను పని నుండి వచ్చేసరికి , ఒక పెద్ద బ్రౌనుకవరు పడివుంది. అది మెయిన్ పోస్టాఫీసు నుండి వచ్చింది. దానిలో ఒక ఉత్తరంతో పాటు, బాగా నలిగిపోయిన ఆంధ్రప్రభ ఉగాదిసంచిక ఉంది. ప్రభకన్నా ఆ ఉత్తరం చూసి ఏడ్వాలో నవ్వాలో తెలియలేదు. ఇది ఆ ఉత్తరం సారాంశం.

"మీకు వచ్చిన పోస్టు సకాలంలో చేరనందుకు క్షమించవలసిందనీ, పోస్టల్‌డిపార్ట్‌మెంటు వాళ్లు మిమ్మల్ని కోరుతున్నారు.

మీకు వచ్చిన రోల్ రోడ్డుపక్కన మంచులో పడి ఉండడంతో, ఎవ్వరో చూసి, అనుమానంతో పోలీసులను పిలిచారు. ఈ మధ్యన బ్రౌన్ పార్శిల్స్ తెస్తున్న ముప్పు అందరికీ తెలిసిందే! పోలీసులు ఇన్వెస్టిగేషన్ చేసిన తరువాత, మీ రోల్‌ని మీకు అందజేశారు. మంచులో పడినందువల్ల మీ పార్సెలు బాగా నలిగిపోయింది. దానికి క్షంతవ్యులం.

ఇకమీదట నుంచి సకాలంలో మీ పోస్టు మీకు అందజేయుగలమని హామీ ఇస్తున్నాము.

వెంటనే మావారికి ఫోన్ చేశాను.

"ఇవాళ మీ చిలిపిప్రభ వచ్చిందండి.."

"చిలిపిప్రభ ఏమిటి? ఎవ్వరైనాచుట్టాలా?"

"కావలసినదే!"

"ఎవ్వరూ? ఇంతకీ మా దొడ్డమ్మమనుమరాలు కాదుకదా! అది ఎవ్వరికీ చెప్పాపెట్టాకుండా వెళ్తుంది. ఇంతకీ ఇంగ్లాండుఎప్పుడు వచ్చిందట?'

"ఇంకేం చెప్పను. వేగిరం వస్తే స్వయంగా చూతురుగానీ" ఫోన్ పెట్టేశాను. మావారికి సస్పెన్సంటే చిరాకు.

ఆయన్ని చికాకు పెట్టడమంటే మాకందరికీ మహా సరదా!!